

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జివాకర్‌రెడ్డి, రత్నకళ్యాణి

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కడెం, నవంబర్ 5 : మండలంలోని గంగాపూర్‌తో పాటు, సమీప గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని ఉట్నూర్, నిర్మల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జివాకర్‌రెడ్డి, రత్నకళ్యాణి అన్నారు. గంగాపూర్‌లో ఆదివారం గంగాపూర్‌తో పాటు, కుర్ర తండా, రాణిగూడ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ మూడు గ్రామాలను ఆనుకొని అటవీ ప్రాంతం ఉండడం, ఆ శాఖ అనుమతులు రాక రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో గ్రామస్తులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయబోమని, గ్రామాలకు రాకుండా అధికారులను అడ్డుకుంటున్న విషయం తెలుసుకున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆదివారం వారితో సమావేశం నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికలను బహిష్కరించవద్దని, కడెం వాగుపై వంతెన నిర్మాణం, రోడ్డు సౌకర్యం విషయమై ఈ నెల 15వ తేదీన కలెక్టర్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఎన్నికలకు సహకరిస్తామని అధికారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ఉపేందర్, సీఐ మోహన్, బీఎల్వో సూపర్‌వైజర్ ఫకీర్‌నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ *హైదరాబాద్* నందు వృద్ధులను *వారి ఇంట్లోనే ఉండి* చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజెంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999.
NT-320244-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## విగ్రహాల ప్రతిష్ఠాపన



ఆలయంలో ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి

కుంటాల, నవంబర్ 5 : అంబకంటి తండాలో శ్రీ జగదాంబ, రామ్‌రావు మహరాజ్ పాదుకా, తాబేలు, నంది, గుర్రం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల సమక్షంలో తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి దర్శించుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ శంకర్, జడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, మాజీ జడ్పీటీసీ రాథోడ్ విమల, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారం

ఇచ్చోడ, నవంబర్ 5 : తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఇస్లాంనగర్ సర్పంచ్ భర్త ఫరీద్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. ఫరీద్‌కు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాండురంగ్, ఎంపీటీసీ గాడ్గె సుభాష్, మాజీ ఎంపీటీసీ నర్వాడే రమేశ్ పాల్గొన్నారు.



కాకో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు



ఆలయం ఎదుట సామూహిక భోజనాలు

# దండారి సంబురం

- పద్మల్‌పురి కాకో ఆలయంలో అట్టహాసంగా వేడుకలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అడవి బిడ్డలు
- సంస్కృతీ సంప్రదాయాల నడుమ పూజలు
- ఆటాపాటలతో మార్మోగిన గుడిరేవు తీరం
- ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు
- ఈ నెల 8న దర్బార్

దండేపల్లి, నవంబర్ 5 : చచోయ్ ఇట్ కోలారా.. దేనే దేనారా.. రేలా.. రేలా.. లాంటి ఆట పాటల నడుమ పద్మల్‌పురి కాకో ఆలయం వేదికగా దండారి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారి వేడుకలు ఆదివారం అంగరంగవైభవంగా నడుస్తున్నాయి. మహారాష్ట్ర కిన్వట్ జిల్లా జవార్ల, ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం అట్నుగడ, జైనూర్ మండలం బూసిమెట్ల, సిర్పూర్(యూ) మండలం దోబా నుంచే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన గిరిజనులు, మహిళలు సుమారు వెయ్యి మందికిపైగా ఆలయానికి చేరుకొని సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. దండారి ఉత్సవాల్లో భాగంగా రేలా.. రేలా.. అంటూ గుస్సాడి నృత్యాలు చేశారు. మహిళలు సంప్రదాయబద్ధంగా నృత్యాలతో సందడి చేశారు.

### ఉత్సవ వేదిక కాకో ఆలయం..

పద్మల్‌పురి కాకో ఆలయాన్ని దండారి ఉత్సవ వేదికగా ఆదివాసులు భావిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గుస్సాడి నృత్యాలు ప్రారంభించి, దీపావళి వరకు తమ తమ గూడేల్లో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. దీపావళి రెండు రోజుల తరువాత కొలబోడి కార్యక్రమం తరువాత ఉత్సవాలను ముగిస్తారు.

### నైవేద్యాల సమర్పణ..

దండారి ఉత్సవాల్లో భాగంగా పద్మల్‌పురి కాకోకు మహిళలు అతి పవిత్రతో నైవేద్యాలు తయారు చేశారు. పాయసంతో పాటు పెసలు, మినుములు, బబ్బెర గారెలు, అలాగే దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మేకలు, కోళ్లు బలిచ్చి ఆలయ సమీపంలో వంటలు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు.

### గోదావరి తీరం వద్ద పుణ్యస్నానాలు..

దండారి ఉత్సవాల కోసం ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా గోదావరికి కాలినడకన చేరుకున్నారు. అక్కడ పుణ్య స్నానాలు చేసి, నదీ జలాలతో అమ్మవారికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. పుణ్యస్నానాల అనంతరం గోదావరి వద్ద పూజలు చేశారు.

### అలరించిన గుస్సాడీ నృత్యాలు..

ఆలయ ఆవరణలో గుస్సాడీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపి, కళ్లద్దాలు, భుజాన జింక తోలు, నడుము, కాళ్లకు గజ్జెలు ధరించి, చేతిలో కోల పట్టుకొని తప్పెట గూళ్ల వాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గుస్సాడి నృత్యాలకు ముందు మహిళలు బొట్టు పెట్టి గుస్సాడీల ఆశీర్వాదం తీసుకున్నారు.

### ఈ నెల 8న దర్బార్..

ఆలయ కమిటీ సభ్యులు, గుస్సాడీలు సాంప్రదాయబద్ధంగా జెండాను ఆవిష్కరించి,ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం జెండా గద్దె వద్ద సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ నెల 8న గుస్సాడీ దర్బార్ నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుడిమెత సోము, సర్పంచ్ చిట్ల లింగవ్వ, మాజీ సర్పంచ్ చిట్ల మంజుభార్గవి, మాజీ ఎంపీటీసీ చిట్ల శ్రీనివాస్, నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి, నవంబర్ 5 : ఇంద్రవెల్లి మండలంలోని ఆదివాసీ గూడేల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాలేగాడ గ్రామంలో గ్రామస్తులు ఏత్మాసూర్ దేవతకు ప్రతేక పూజలు నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మడావి భీంరావు, గ్రామ పెద్దలు మడావి ధర్ము, కోవ కాశీరాం, నైతం లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ముసలం

- పార్టీకీ రాజీనామా చేయనున్న సీనియర్లు
- రెబల్‌గా సంజీవ్‌రెడ్డి పోటీ
- అధిష్టానం తీరుపై ఆగ్రహం

ఆదిలాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిలా కాంగ్రెస్‌లో ముసలం పుట్టింది. ఆదిలాబాద్ నియోజకవర్గ టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం తమకు అన్యాయం చేసిందంటూ సీనియర్లు మండిపడుతున్నారు. అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆర్ఎస్ఎస్ పేరిట కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధిష్టానం నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకించారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారిని కాదని, పారాచూట్ లీడర్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ అమ్ముకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ టికెట్‌ను తమకు ఇవ్వాలని సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్ రెడ్డి అధిష్టానాన్ని కోరారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వవద్దంటూ సూచించారు. నియోజకవర్గ ప్రజలతో మంచి సంబంధాలు ఉండి, గెలిచే వ్యక్తిని గుర్తించాలన్నారు. ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా విజయం కోసం కృషి చేస్తామని నాయకులకు సూచించారు.

### రెబల్‌గా సంజీవ్‌రెడ్డి పోటీ..

కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ నియోజకవర టికెట్‌ను రెండో జాబితాలో కంది శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించారు. దీంతో ఆగ్రహంలో ఉన్న సీనియర్లు అధిష్టానం నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టికెట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ అధిష్టానం డబ్బులు ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యమిచ్చిందని, టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. పార్టీ పెద్దలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ ఓడిపోతుందని సూచించారు. అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పార్టీని వీడాలని నిర్ణయించారు. ముగ్గురు సీనియర్లతో పాటు వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పార్టీకి నేడు రాజీనామ చేయనున్నారు. కాంగ్రెస్ రెబల్‌గా సంజీవ్‌రెడ్డిని పోటీలో నిలుపనున్నట్లు వారు పేర్కొన్నారు.

# కుమ్రం భీం వర్ధంతి వేడుకల్లో అపశృతి

- జెండా ఎత్తుతుండగా విద్యుత్ తీగలు తాకి ఇద్దరు మృతి



మోహన్ (ఫైల్)



భీంరావ్ (ఫైల్)

కడెం, నవంబర్ 5 : కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామంలో ఆదివారం విషాదం చోటు చేసుకున్నది. విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం వర్ధంతి సందర్భంగా గ్రామంలో జెండావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కోసం ఇనుప జెండాను నిలబెట్టేందుకు యువకులు పెంద్రం మోహన్ (24), ఆత్రం భీంరావ్ (30), వెడ్మ ఎంకుపటేల్ ప్రయత్నించారు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగలకు జెండా తగలడంతో షాక్ తగిలి ముగ్గురు యువకులు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని స్థానికులు వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పెంద్రం మోహన్ (24), ఆత్రం భీంరావ్ (30) చికిత్స పొందుతూ మృతి చెందారు. మురో యువకుడు వెడ్మ ఎంకుపటేల్‌ను నిర్మల్‌లోని దవాఖానకు చికిత్స పొందుతున్నారు. పెంద్రం మోహన్ అవివాహితుడు కాగా, ఆత్రం భీంరావుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కండ్ల ముందే యువకులు మృతి చెందడంతో ఆ కుటుంబాల సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో పంచనామా అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.